## తెగిపడిన విద్యుత్‌ వైరు



బండ్లగూడ: బైరాగిగూడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న స్ట్రీట్‌లైట్ల వైరు సోమవారం ప్రమాదవశాత్తు తెగిపోయి రహదారిపై పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేష్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన కరెంట్‌ కట్‌ చేయించి లైన్‌ను సరి చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## నేడు అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ



రాజేంద్రనగర్‌: ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు కాటేదాన్‌లో డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ, జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దాసరి శ్యామ్‌ మనోహర్‌తో పాటు వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.చంద్రయ్య, జనరల్‌ సెక్రటరీ రమేశ్‌ మేది, రాష్ట్ర అడిషనల్‌ సెక్రటరీ ఎస్‌.సోమల తదితరులు హాజరవుతారన్నారు.

## ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



రాయదుర్గం: గౌలిదొడ్డిలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

## 60 టన్నుల ఇసుక స్వాధీనం.. ఒకరి అరెస్ట్‌

గచ్చిబౌలి: అక్రమంగా నిల్వ ఉంచిన 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్‌ చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్‌లో నివాసం ఉండే కాసాల సుమన్‌(31) ఖాజాగూడలో అక్రమంగా ఉంచిన ఇసుక డంప్‌ను సోమవారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా ఇసుకను నిల్వ ఉంచారని, భద్రాచలం నుంచి అక్రమంగా లారీల్లో వచ్చిన ఇసుకను కొనుగోలు చేసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని భావించిన నేపథ్యంలో పలు జిల్లాల్లో ఇసుక నిల్వలపై దాడులు చేస్తున్నామన్నారు. నిందితుడు సుమన్‌ను అరెస్ట్‌ చేశారు. దీనిపై విచారణ చేయనున్నారు.

## సివిల్‌ ఇంజనీరింగ్‌ ప్రాముఖ్యతను గుర్తించాలి

మనూలో ఎఫ్‌డీపీ శిక్షణ ప్రారంభం

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ)ని ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో ఎన్‌ఐటీ, సెంట్రల్‌ యూనివర్సిటీలు, ఐఐటీ, మల్టీనేషనల్‌ కంపెనీల నుంచి 50 మందికి పైగా పాల్గొనగా పలువురు నిష్ణాతులు అవగాహన కల్పించారు. 'మనూ' క్యాంపస్‌లోని పాలిటెక్నిక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్‌ షగుఫ్తా షాహీన్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ జీవితాలను మెరుగుపర్చడానికి సివిల్‌ ఇంజనీరింగ్‌ ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సివిల్‌ ఇంజనీరింగ్‌ విభాగానికి చెందిన కోఆర్డినేటర్లు డాక్టర్‌ జీనత్‌ఆరా, డాక్టర్‌ మహ్మద్‌ జక్వాన్‌, మనూ పాలిటెక్నిక్‌ వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ జంగ్లపల్లి అబ్దుల్‌ రహీమ్‌ పాల్గొన్నారు.

# గులాబీ శ్రేణుల్లో జోష్‌

ఘనంగా కేసీఆర్‌ జన్మదిన వేడుకలు

అత్తాపూర్‌: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ జన్మదిన వేడుకలు అత్తాపూర్‌ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తాపూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్‌ మాట్లాడుతూ..కేసీఆర్‌ చేసిన అభివృద్ధి రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరన్నారు. లక్ష్మణ్‌, బంగి శ్రీను, మల్లేష్‌, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.



మణికొండలో.. బీఆర్‌ఎస్‌ నాయకులు

### బండ్లగూడలో..

బండ్లగూడ: బండ్లగూడలో కేసీఆర్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజ్‌ ఆధ్వర్యంలో భారీ కేక్‌కట్‌ను కట్‌ చేశారు. మాజీ కార్పొరేటర్‌ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా కార్యాలయంలో..

శంషాబాద్‌ రూరల్‌: మున్సిపల్‌ కేంద్రంలోని బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా కార్యాలయంలో కేసీఆర్‌ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు మోహన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్‌ సతీష్‌, పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌గౌస్‌ పాషా, మాజీ సర్పంచ్‌ సత్యనారాయణగౌడ్‌, నాయకులు పాల్గొన్నారు.

### లక్ష్మీగూడలో..

మైలార్‌దేవ్‌పల్లి: కేసీఆర్‌ జన్మదినం సందర్భంగా మాజీ కౌన్సిలర్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు ఎస్‌.వెంకటేష్‌ లక్ష్మీగూడలోని ప్రాథమిక పాఠశాలలో కేక్‌కట్‌ చేసి విద్యార్థులకు పండ్లు, వాటర్‌ బాటిల్స్‌ పంపిణీ చేశారు. రాఘవేందర్‌యాదవ్‌, రాజేష్‌యాదవ్‌, అరుణ్‌ముదిరాజ్‌, ఈశ్వర్‌, సురేష్‌, భాస్కర్‌, కార్తీక్‌ముదిరాజ్‌, మల్లేష్‌, అశోక్‌కుమార్‌, రాజు, రాయుడు, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

### పండ్లు పంపిణీ..

రాజేంద్రనగర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ డివిజన్‌ అధ్యక్షుడు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా పార్టీ ఆఫీస్‌లో కేక్‌ కట్‌ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ప్రీతంరాజ్‌, నవీన్‌ కుమార్‌, చిరంజీవి, నరేశ్‌ ముదిరాజ్‌, నరేందర్‌ రెడ్డి, మంజుల, సుల్తానా, అశ్ఫక్‌, రాజు గౌడ్‌, మారి, వెంకటేశ్‌, శ్రావణ్‌, గోపాల్‌, మహమ్మద్‌ ఇద్రిస్‌, గఫార్‌, సందీప్‌ పాల్గొన్నారు.

### మణికొండలో..

మణికొండ: బీఆర్‌ఎస్‌ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ఆధ్వర్యంలో కేక్‌కట్‌ చేసి, పేదలకు అన్నదానం చేశారు. నార్సింగిలో ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌ కట్‌ చేసి సంబరాలు చేసుకున్నారు.



ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



అత్తాపూర్‌లో..

# భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం

బండ్లగూడ: కిస్మత్‌పూర్‌లో సోమవారం శివరామకృష్ణ దేవతామూర్తుల యంత్ర ప్రతిష్ఠ మహా కుంభాభిషేకం మహోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హంపీ వీరుపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ రాందాస్‌ ముదిరాజ్‌, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి, శేఖర్‌ముదిరాజ్‌, పూలపల్లి కృష్ణారెడ్డి, కడారి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌, మాజీ కార్పొరేటర్‌ ప్రశాంత్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

# ఔటర్‌ ర్యాంప్‌ పనులు ప్రారంభం



ప్రారంభమైన ర్యాంప్‌ రోడ్డు పనులు

మణికొండ: నానక్‌రాంగూడ సర్కిల్‌లో ట్రాఫిక్‌ రద్దీని తగ్గించేందుకు ఔటర్‌పై చేపట్టిన ర్యాంప్‌ పనులు ప్రారంభమయ్యాయి. గచ్చిబౌలి నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు రాకపోకలు సాగించే ఐటీ ఉద్యోగులతో పాటు ఇతరులు నానక్‌రాంగూడ సర్కిల్‌లో ఔటర్‌ రింగ్‌ రోడ్డు దిగుతున్నారు. దీంతో సర్కిల్‌లో సిగ్నల్స్‌ వద్ద ట్రాఫిక్‌ రద్దీ పెరిగిపోయి అర గంటకు పైగా సర్కిల్‌ దాటేందుకు వాహనదారులు వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో ట్రాఫిక్‌ పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో నానక్‌రాంగూడ సర్కిల్‌ దాటిన తర్వాత కొత్తగా ర్యాంప్‌ను ఏర్పాటు చేయాలని హెచ్‌ఆర్‌డీసీఎల్‌ అధికారులు నిర్ణయించారు. ర్యాంప్‌ ఏర్పాటు కోసం గతంలోనే 80 మీటర్ల పొడవున సైకిల్‌ ట్రాక్‌ను గతంలోనే తొలగించారు. పనులకు ఇటీవల టెండర్‌ పిలవడం, ఫైనల్‌ కావటంతో సోమవారం నుంచి పనులను ప్రారంభించారు. ఈ నెలాఖరు లోపు పనులను పూర్తి చేసి ర్యాంప్‌ రోడ్డును ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ర్యాంపు రోడ్డు ప్రారంభమయితే గచ్చిబౌలి నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు వచ్చే ప్రయాణికులు నానక్‌రాంగూడ సర్కిల్‌ దాటాక ఔటర్‌ దిగి సర్వీసు రోడ్డులో రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతుందని వారు వివరించారు.

# మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అత్తాపూర్‌: రాంబాగ్‌ చిన్న అనంతగిరి ఆలయంలో నిర్వహించనున్న మహా శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన వాల్‌ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మోంగ్ర నర్సింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్‌, ఉపాధ్యక్షుడు బర్ల మల్లారెడ్డి, కోశాధికారి ఎస్‌.బి.హరినాథ్‌, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, ప్రచార కార్యదర్శులు మల్లారెడ్డి, ప్రచార కార్యదర్శులు సాబాద విజయ్‌ కుమార్‌, మోంగ్ర ఐలయ్య, కార్యవర్గ సభ్యులు ఎస్‌.జయానంద్‌రెడ్డి, పెంటల సుధాకర్‌రెడ్డి, మ్యాడం రాము, సోమారం సురేందర్‌, ఎల్‌.వెంకటేష్‌, సాబాద ఆనంద్‌, రావుల జగన్‌, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా గ్రేప్‌ ఫెస్టివల్‌



దాక్ష పండ్లను పరిశీలిస్తున్న వీసీ రాజిరెడ్డి, అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రానగర్‌లోని ద్రాక్ష పరిశోధన కేంద్రంలో సోమవారం గ్రేప్‌ ఫెస్టివల్‌ తెలంగాణ రాష్ట్ర ద్రాక్ష రైతుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండ రాజిరెడ్డి, దాక్ష నిపుణుడు డాక్టర్‌ ఎస్‌.డి శిఖమణి, పద్మశ్రీ చారల వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. దాక్ష పంటలో ఎదురవుతున్న సవాళ్ల, వాటి యాజమాన్య పద్ధతులపై చర్చించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ మార్కెట్‌ డిమాండ్‌ను అనుసరించి రకాలను ఎంచుకొని లాభపడాలని సూచించారు. వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ..వాతావరణ పరిస్థితులు, చీడపీడల మధ్యగల సంబంధాలను తెలుసుకొని తదనుగునంగా పంట యాజమాన్య చర్యను చేపట్టి రైతులు అధిక దిగుబడులు, లాభాలను అర్జించవచ్చని తెలిపారు. దాక్ష ప్రత్యేక శాస్త్రవేత్త పూర్వ ఉపకులపతి శిఖామణి రైతుల సందేహాలు, అధిక నాణ్యత గల ద్రాక్షను పండించడం గురించి రైతులకు అవగాహన కల్పించారు. రాజేంద్రగనర్‌లోని దాక్ష పరిశోధన కేంద్రంలో పండించిన 40 రకాలకు పైగా ద్రాక్ష పండ్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ భగవాన్‌, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: ఫీడర్ల నిర్వహణ, సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌ చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామని నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సీబీఐటీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని శాంతినగర్‌, సబితానగర్‌, ట్రెజర్‌ ఐలాండ్‌, సీబీఐటీ కళాశాల ముందు లైన్‌, హైమా డెవలపర్స్‌ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో 'కుటుంబ వికాసం'



మైలార్‌దేవ్‌పల్లి: 'కుటుంబ వికాసం'లాంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఎంతో నేర్చుకుంటారని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్‌ సుజాతసెబాస్టియన్‌ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి బ్రాంచ్‌ శ్రీ చైతన్య పాఠశాలలో 'కుటుంబ వికాసం'అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, వారి నాయనమ్మలు, తాతయ్యలు పాదాలకు పూజలు చేసి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు విద్యారులకు కుటుంబ వ్యవస్థను గురించి, పిల్లలు పెద్దలను గౌరవించే సభ్యత, సంస్కారం కలిగి ఉండాలని, కుటుంబ విలువలను, ఉమ్మడి కుటుంబాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్‌ శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి'లో నాలుగు ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవి కుమార్‌

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నాలుగు ఫిర్యాదులు అందాయని సర్కిల్‌ ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవి కుమార్‌ తెలిపారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసినట్లు వెల్లడించారు. రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్‌, శాస్త్రిపురం, అత్తాపూర్‌ డివిజన్లకు చెందిన ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. అధికారులు పర్యటించి ఆయా సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



## ఐఐఆర్‌ఆర్‌, పీజేటీఏయూ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ఏజీవర్సిటీ: హైదరాబాద్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ, ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది.వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ సీహెచ్‌ విద్యాసాగర్‌, ఐఐఆర్‌ఆర్‌ సంచాలకులు ఆర్‌ మీనాక్షి సుందరం, వీసీ ఆల్దాస్‌ జానయ్య సమక్షంలో జరిగిన అవగాహన ఒప్పందంలో పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ జానయ్య మాట్లాడుతూ.. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పరిశోధనలు ప్రాధాన్య పద్ధతిలో చేపట్టాలని వరిలో ఉత్పత్తి ఉత్పాదకతల పెంపుతో పాటు రైతులు, వినియోగదారులకు ప్రయోజనాలు కలిగించేలా ఇరు సంస్థలు కలిసి పనిచేయాలన్నారు. వరిలో కార్బన్‌ క్రెడిట్‌ ద్వారా రైతులు మరింత ఆర్థికపరమైన ప్రయోజనం కలిగించే విధానాలపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 5 మిలియన్‌ టన్నుల మేర వరి ధాన్యం మిగులు ఉత్పత్తి చేస్తోందని అందుకు ఎగుమతులే సరైనా విధానమని రైతులను అటువైపు మళ్లించడానికి అవసరమైన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



టోలిచౌకీ వద్ద పర్యటిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌసర్‌ తదితరులు

గోల్కొండ: కార్వాన్‌ నియోజకవర్గంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్‌ అన్నారు. సోమవారం ఆయన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని కార్వాన్‌, లంగర్‌హౌస్‌, నానల్‌నగర్‌ తదితర డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జలమండలి డివిజన్‌ 3, 4లలో జరుగుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయించాలన్నారు. మరో వైపు ఎండిలైన్స్‌, టోలిచౌకీ, టూంబ్స్‌ చౌరస్తా, లంగర్‌హౌస్‌ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్లు, వరద నీటి పైప్‌లైన్‌ పనులు వెంటనే పూర్తి చేయించాలన్నారు. లక్ష్మీనగర్‌ మెయిన్‌ రోడ్డు, గుడిమల్కాపూర్‌ మార్కెట్‌, కార్వాన్‌ రోడ్డు తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్‌ తవ్వకాల వల్ల ట్రాఫిక్‌ జామ్‌ అవుతుందని పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌, నాయకులు హారూన్‌ ఫరాన్‌, వజీఉజ్‌జమా తదితరులున్నారు.


## మహిళలు చదువుకుంటే సమాజం బాగుపడుతుంది



మాట్లాడుతున్న స్వప్న

మైలార్‌దేవ్‌పల్లి: మహిళలు చదువుకుంటే సమాజం బాగుపడుతుందని సేవాభారతి పర్యవేక్షకురాలు స్వప్న అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని సేవా భారతి ఆధ్వర్యంలో కిశోరి వికాస్‌ యోజన పేరిట 30 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని 30 మంది నిర్వాహకులు, 9 మంది పర్యవేక్షకులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉచిత విద్యా బోధనను అందదించేందుకు ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఈ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళా విద్యా ప్రాధాన్యతను గుర్తించామన్నారు.కిశోరి వికాస్‌ యోజన ద్వారా సమాజంలో సుస్థిర మార్పును తీసుకురావడమే లక్ష్యమన్నారు.

## టీఎన్‌జీఓ కాలనీలో కులగణనపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు, అధికారులు

రాయదుర్గం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన రెండవ విడతలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం టీఎన్‌జీఓ కాలనీలో పర్యటించారు. . కాలనీవాసులకు కులగణనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులు మాట్లాడుతూ మొదటివిడతలో మిగిలిపోయిన వారికి మరో విడతలో అవకాశం కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారికి అందాలంటే వివరాలు ఇవ్వాలన్నారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ ముకుంద రెడ్డి, అసిస్టెంట్‌ కమిషనర్‌ ప్రేమ్‌కుమార్‌, టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్‌, మాజీ అధ్యక్షుడు సుధాకర్‌, కె రవీందర్‌రెడ్డి, తెలంగాణ బీసీ కమిషన్‌ సభ్యుడు తిరుమలగిరి సురేందర్‌, మహిళా పెన్షనర్ల సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

## తైక్వాండోలో సత్తా

మణికొండ: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా అథ్లెట్లు సత్తా చాటారు. సరూర్‌నగర్‌ స్టేడియంలో ఆదివారం జరిగిన తైక్వాండో రాష్ట్ర చాంపియన్‌షిప్‌ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న మణికొండ సోమాస్‌ ఫిట్‌ వరల్డ్‌ తైక్వాండో అకాడమీ అథ్లెట్లు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. క్యోరుగి(ఫైట్‌), వ్యక్తిగత పుమ్సే, పేర్‌ పుమ్సే, టీమ్‌ పుమ్సే పోటీలలో 18 స్వర్ణం, 7 రజత, 8 కాంస్య పతకాలను సాధించారని అకాడమీ టీమ్‌ హెడ్‌ కోచ్‌ మాస్టర్‌ విజయ్‌కుమార్‌ తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలలోనూ తమ క్రీడాకారులు సత్తా చాటుతారన్నారు.

